# ప్రతిఘటన

"అన్నలొచ్చింద్రు... మిమ్ముల తీసుకురమ్మంటాంద్రు" అన్నాడు సేక్‌సింధ్, కొమురయ్య తెల్లవారగానే రాజేశం ఇంటికొచ్చి.

ఉదయం లేవగానే ఓ అరగంటసేపు వ్యాయామం చెయ్యడం రాజేశాని కలవాటు. ఆ రోజు కూడా అతడు ఆ పనే చేస్తున్నాడు.

"అన్నలు మొన్ననే వచ్చిపోయిరి గద- మల్లెందుకొచ్చింద్రు" అన్నాడు రాజేశం ఆసనాలు వెయ్యడం పూర్తిచేసి.

"వీళ్ళు మొన్నొచ్చిపోయిన అన్నలు కారట. వీరు వేరే అన్నలట."

"వేరే అన్నలా? వేరే అన్నలంటె ఎవరో! అసలోళ్ళేనా? నకిలీలైతే కారు గదా!" అన్నాడు రాజేశం వాళ్ళింటి ముందున్న అరుగు మీద కూర్చొని.

"నకిలీలు కారండి – వీళ్ళు చాలా జోరుమీదున్నరు"

"నన్నొక్కన్నే రమ్మన్నరా? ఇంకెవరినన్నా రమ్మన్నరా?"

"తమర్నీ, శేషయ్యగార్నీ ఎట్లుంటె అట్ల అర్జంటుగ తీసుకురమ్మన్నరు- వాళ్ళకు తెల్వదా... మీరిద్దర్ని కలిస్తె ఊరందర్నీ కలిసినట్టేనని" అన్నాడు కొమురయ్య.

"ఎక్కడున్నరు?"

"శేషయ్యగారి మామిడితోట్లున్నరు. వాళ్ళతోటి ఇద్దరాడమనుషులు కూడున్నరు.... మనూరి మాదిగ పోచయ్య, మంగలి సారయ్య కూడా వాళ్ళతోటి చేరింద్రు.... నన్ను వాళ్ళ దగ్గరికి పోచిగాడే తీసుకపోయిండు"

"ఎంతమందున్నరు?"

"యేడెనిమిది మందున్నట్టుంది...."

"శేషయ్యగార్కి చెప్పినవా?"

"ఇంక చెప్పలేదండి- మొదలు మీకు చెప్పిపోదామని ఇటొచ్చిన"

"శేషయ్యగార్ని పంచాయితి ఆఫీసు దగ్గరకు రమ్మను- నేను స్నానం చేసి యింకో అరగంటలో వస్తున్ననని చెప్పు"

"గట్లనే చెప్పుత... పోతన్న... నేను సుత పంచాయితి ఆఫీసు దగ్గరుంట" అంటూ కొమురయ్య వెళ్ళిపోయాడు.

రాజేశం స్నానం చెయ్యడానికి చేదబావి దగ్గరకు వెళ్ళాడు. అక్కడ బకెట్లో చేదిపెట్టిన చన్నీళ్ళను వంటి మీద పోసుకున్నాడు.

"అన్నలు మొన్ననే వచ్చిపోయిరి గద- మల్లెందుకొచ్చింంద్రో" అంది రాజేశం భార్య సుమతి అక్కడకొచ్చి అతని వీపు రాస్తూ.

"వీళ్ళు వాళ్ళు కారట. వేరేనట- వాళ్ళల్ల చాలా గ్రూపులున్నయి"

"ఈ ఊళ్ళెకు ఎవరొచ్చినా నిన్నే రమ్మంటరు. గీ సర్పంచ్‌గిరి బాగనే నెత్తిమీద పెట్టుకున్నవు. దుఃఖంలేనోడు బఱ్ఱెను కొనుక్కున్నట్టు - ఎటుపోయి ఎటొస్తదోనని నేను భయపడి ఛస్తాన్న..." అంది సుమతి అతని వీపుకు సబ్బురాసి నీళ్ళు పోస్తూ,

'నువ్వెందుకంత భయపడి ఛస్తున్నవు... గీ అన్నలు మనకేమన్న కొత్తనా? ఎప్పటికి చూస్తనే వుంటిమి.... వీల్లు కూడా డబ్బులడుగతానికే వచ్చింంద్రు కావొచ్చు... ఎట్లన్న జేసియ్యాలె..."

"యెట్ల జేసిస్తవు? మొన్ననే ఊర్లెకాస్త పచ్చగున్నోల్లందరు కలిసి ఇరవై ఐదువేలు జమజేసిస్తిరి- వారం రోజులల్లనే మల్ల వీళ్ళు డబ్బుగావాల్ననొస్తె ఎక్కన్నించి తెచ్చిస్తరు? ఈ ఊరోళ్ళందరూ వాళ్ళకున్న భూముల్నమ్ముకొని వరంగల్ బోవుడు తప్ప ఇంకో దారి కనబడ్తలేదు. గా నరసింహారెడ్డి దొర ఎంత మంచి పని జేసిండో జూడు. దీపం వుండంగనే ఇల్లు చక్కబెట్టుకున్నడు- ఎన్నడో భూములన్ని అమ్ముకొని అవతలబడ్డడు- గాయనమ్ముతాంటె పిచ్చోల్లలెక్క మనం కొనుకున్నం... మనకు భూములున్నయని అన్నలు మనెంటబడ్తున్నరు. గాదొరగారేమో పట్నంల మంచిగ వ్యాపారం జేస్తున్నడు. కోట్లు సంపాయిస్తున్నడు- గీ అన్నలు గసుంటోళ్ళ జోలికిబోరు. మనసుంటోళ్ళ జోలికే వస్తరు". అంది సుమతి.

"యేం జేద్దాం మరి? గా దొరోల్లలెక్క మనం పుట్టినూర్ను విడిచిపెట్టి పోలేంగద?" అన్నాడు రాజేశం.

"సరెగని గా అన్నల్తోటి జర నిమ్మలంగ మాట్లాడు. నామీదికి లేచినట్టు వాళ్ళమీదిక్కూడ ఒంటికాలి మీద లేవకు. గప్పుడే మనం ముగ్గురు పోరగాళ్ళను కంటిమి. నీకేమన్నయితె గా పోరగాళ్ళు దిక్కులేనోల్లయితరు.. నీకేమన్నయితే నేనుంటననుకోకు. యేబాయిలనన్న పడి ఛస్త.... గా పోరగాళ్ళ కోసమన్న జర పదిలంగుండు" అంది సుమతి. అలా అంటూనే సుమతి కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"యేం కాదు లేవే.... పొద్దునపొద్దున్నే గీ యేడ్పు షురుజేసినవు?... గీ అన్నలు మనకేమన్న కొత్తోళ్ళా? వాళ్ల దగ్గరికి ఎన్నిసార్ల బొయినం... ఎన్నిసార్లొచ్చినం- మనమేమన్న దొరలమా? జమీందార్లమా? మొన్నటిదాక మా అయ్య తాల్లెక్కి కల్లుగీసి బతికిండు... గిప్పుడంటె గింత భూమి కొనుక్కోని గిట్లున్నము... వాళ్ళు మన జోలికెందుకొస్తరే" అన్నాడు రాజేశం.

"ఏమ్మో! అన్ని రోజులొక్క తీరుగుంటయా యేంది? నువ్వై ఆవేశానికి రాకు. యేదన్నుంటె గా శేషయ్య మామను మాట్లాడమను... గాయనైతె జర నిమ్మలంగ మాట్లాడుతడు" అంది సుమతి.

"గట్లనే లేవె... నేనేం మాట్లాడ. గమ్మునుంట- సరెనా?"

రాజేశం స్నానం చెయ్యడం పూర్తి చేసి నడుముకు తువ్వాలు చుట్టుకొని యింట్లోకొచ్చాడు. తెల్లగా మెరుస్తున్న ఖద్దరు ధోవతి, షర్టూ తీసి వేసుకున్నాడు. తల దువ్వుకున్నాడు.

రాజేశానికి ముప్పై యేళ్ళుంటాయి. అతనిది భారీ విగ్రహం. ఆరడుగుల ఎత్తు, ఎత్తుకు తగ్గ లావు. చామన ఛాయ- చిన్నప్పట్నించీ ఆటలంటే ఇష్టం- కబడ్డీ, వాలీబాల్ మొదలైన ఆటలు ఆడేవాడు-హైస్కూల్లోనూ, జూనియర్ కాలేజిలోనూ చదువుకునే రోజుల్లో ప్రతి ఆటల పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ అతనికే లభిస్తుండేది. చిన్నప్పట్నించీ వ్యాయామానికీ, ఆటలకూ అలవాటు పడడం వల్ల అతని శరీరంలో దృఢత్వం, రాటుదేలినతనం కనిపిస్తుంది. అవసరమైతే ఎంత కష్టానికైనా అతని శరీరం సహకరిస్తుంది.

పోయినసారి జరిగిన పంచాయితి ఎన్నికల్లో ఆ ఊరి యువకులందరూ కలిసి రాజేశాన్ని సర్పంచ్ పోటీకి నిల్చోబెట్టారు.

–అంతకు ముందున్న సర్పంచ్ వెంకటయ్య పదేళ్ళుగా ఆ పదవిలో కొనసాగినప్పటికీ ఆ ఊరికేవిధమైన మేలూ చెయ్యలేదని, రాజేశం లాంటి సచ్చరిత్రులు ముందుకొస్తె ఆ ఊరు బాగుపడ్తుందని ఆ ఊరి యువకులందరూ ఊర్లో ప్రచారం చేసి రాజేశాన్ని సర్పంచ్ పదవికి పోటీ చెయ్యడానికి వప్పించారు. రాజేశం వెంకటయ్యపై చాలా సులభంగా గెల్చాడు.

శేషయ్య ఆ ఊరికి చాలా కాలం పట్వారిగా పనిచేశాడు– ఆ మధ్య ప్రభుత్వం పటేల్ పట్వారీ పదవుల్ని రద్దు చెయ్యడంతో శేషయ్యకున్న పట్వారీగిరి కూడా పోయింది. అయినా చాలా కాలంగా ఆ ఊరి ప్రజల్లో ఆయనకున్న గౌరవం ఏ మాత్రం కూడా తగ్గలేదు. ఆ ఊర్లో ఏ సమస్య తలెత్తినా ఆ ఊరివాళ్ళందరూ శేషయ్య దగ్గరికే వెళ్తుంటారు– శేషయ్య అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని సూచిస్తుంటాడు. ఆ ఊర్లో ఎన్ని పార్టీలున్నా, ఎన్ని గ్రూపులున్నా అందరూ శేషయ్య దగ్గరికే వెళ్తుంటారు. శేషయ్య మాటను గౌరవిస్తుంటారు. డెబ్బయ్యోపడిన పడిన శేషయ్య ఆ ఊరికంతటికీ పెద్ద దిక్కుగా ఉండేవాడు. శేషయ్య కూడా రాజేశాన్ని సర్పంఛ్ పదవికి పోటీ చెయ్యమని ప్రోత్సహించాడు.

రాజేశం పంచాయితి ఆఫీసు దగ్గరకొచ్చేటప్పటికి అక్కడ చాలా మంది యువకులు గుమిగూడారు.

"మల్ల అన్నలొచ్చింద్రట" అని ఒకరితో ఒకరు గుసగుసగా చెప్పుకుంటున్నారు.

రాజేశాన్ని చూడగానే అందరూ వచ్చి అతని చుట్టు చేరారు.

"అన్నలొచ్చింద్రట.... నిజమేనా?" అన్నాడు అక్కడున్న యువకులందరిలోనూ చాలా హుషారుగా కనిపిస్తున్న సోమలింగయ్య.

"నిజమేనట... ఇప్పుడే ఇగో గీ సేక్‌సింధ్ కొమురయ్యొచ్చి చెప్పిండు" అన్నాడు రాజేశం అక్కడే నిల్చున్న కొమురయ్యను చూపిస్తూ.

"వీళ్ళు మొన్నొచ్చిపోయినోళ్ళు కాదట్నా' అన్నాడు అక్కడున్న మరో యువకుడు శంకర్.

"కాదట.... వీళ్ళది మరేదో గ్రూపున్నట్టుంది" అన్నాడు రాజేశం.

వాళ్ళలా మాట్లాడుకుంటుండగానే అక్కడకు శేషయ్య కూడా వచ్చాడు. శేషయ్యను చూడగానే అందరూ

"నమస్కారం పంతులుగారూ" అన్నారు.

శేషయ్య అందరికీ ప్రతినమస్కారం చేశాడు. తెల్లటి పంచె, తెల్లటి కమీజు ధరించి, భుజం మీద ఉత్తరీయం వేసుకొని, చేతిలో గొడుగు పట్టుకొని శేషయ్య వచ్చాడు. శేషయ్య ఎత్తుగా, సన్నగా వుంటాడు.

అందరూ వెళ్ళి పంచాయితి ఆపీసులో కూర్చున్నారు.

"గీ అన్నలు మల్లెందుకొచ్చింద్రట?" అన్నాడు సోమలింగయ్య.

"ఎందుకొస్తరు? ఎందుకొచ్చింద్రని మనం అడిగేటట్టుందా? అన్నలొస్తరు– అన్నలు వచ్చిపోంగనే పోలీసులొస్తరు. అన్నలెందుకొచ్చంద్రో చెప్పుంద్రని నిలదీస్తరు – పోలీసులు పోంగనే మల్ల అన్నలొస్తరు. వీళ్ళిద్దరి మధ్య మనం ఎంత నలిగిపోతున్నమో ఎవనిగ్గావాలె? – అన్నల్నేమన్నంటె అన్నలూరుకుంటరా? పోలీసుల్నేమన్నంటె పోలీసులూరుకుంటరా? నోర్లు మూసుకొని వాళ్ళు చెప్పినట్టు వినుడే మన పని. వాళ్ళు కొడ్తె పడాలె, చంపితె చావాలె. వాల్లేం జేసినా మనం వాళ్లను పల్లెత్తు మాటనటానికి వీల్లేదు" అన్నాడు శేషయ్య.

'గీ అన్నలు కూడ మల్ల పైసలడిగితె యేం జెప్పుతరు?" అన్నాడు సోమలింగయ్య.

"యేం జెప్పాల్నో మీరే జెప్పుండ్రి. మీరేం జెప్పమంటె గదే చెప్పుతం" అన్నాడు శేషయ్య.

"మా ఊరోళ్ళందర్ని చంపినాసరె ఒక్కపైస కూడ పుట్టదని చెప్పుండ్రి. మొన్ననే ఊరంత ఊడ్చి గా అన్నలకు ఇరవై ఐదు వేలిచ్చినమని చెప్పుండ్రి" అన్నాడు సోమలింగయ్య.

"యిప్పుడేం లేదంటె వాళ్ళూరుకోరులే. ఎంతో కొంత ఇస్తమని ఒప్పుకోకపోతె వాళ్ళు మన రాజేశాన్ని, శేషయ్యగార్ని వదిలిపెట్టరు..." అన్నాడు శంకర్.

"ఎంతో కొంత ఎక్కడ్నించి తెచ్చిస్తరు?" అన్నాడు సోమలింగయ్య.

"మన యిండ్లల్ల యేదుంటే అది అడ్డికి పావుశేరు అమ్మియ్యాలె. ఎవని కోసం యిస్తరు? ప్రాణం కంటె ఎక్కువేమున్నది?" అన్నాడు శంకర్.

ఈ విషయం మీద వాళ్లల్ల వాళ్లకు చాలా సేపు తర్జన భర్జన జరిగింది. చివరకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఐదువేల కంటె ఎక్కువ చందా ఇస్తమని ఒప్పుకోవద్దన్న నిర్ణయం జరిగింది.

అందరూ కలిసే మామిడితోటలో వున్న అన్నల దగ్గర కెడ్దామని నిర్ణయించుకొని వాళ్ళందరూ పంచాయితి ఆఫీసులోంచి బయటకొచ్చారు- కానీ అక్కడే వున్న కొమురయ్య "అన్నలు శేషయ్యగారు, రాజేశంగారు తన్ప మరెవ్వరూ రావొద్దని గట్టిగా చెప్పిండ్రండి" అనడంతో వాళ్ళంతా ఊరి బయటి దాకా వచ్చి అక్కడున్న ఆ ఊరి స్కూలు దగ్గర ఆగిపోయారు- అది ఎండాకాలం కావడంవల్ల స్కూలు మూసేసి ఉంది.

"మీరు పోయిరాండ్రి. మీరొచ్చేదాక మేం గీస్కూళ్ళనే ఉంటం" అన్నాడు సోమలింగయ్య.

"సరె. మంచిది" అంటూ శేషయ్య, రాజేశం మామిడితోట వైపు నడిచారు- కొమురయ్య కూడా వాళ్ళ ననుసరించాడు.

వాళ్ళు మామిడితోటను సమీపించగానే సెంట్రీ డ్యూటీలో ఉన్న దళ సభ్యుడు మిగతా సభ్యుల్ని అలర్ట్ చేశాడు.

అక్కడున్న మిగతా యేడుగురిలో ఇద్దరు ఆడవాళ్ళు కూడా వున్నారు. అందరూ పాతికేళ్ళలోపువాళ్ళే - అందరూ ఆలివ్‌గ్రీన్ యూనిఫామ్‌లు ధరించారు. ఓముగ్గురి చేతుల్లో గన్స్ వున్నాయి. అందరూ ఆ తోటలో వున్న బావి పక్కనున్న గడ్డ మీద నిల్చొని వున్నారు. అందరికన్న ముందు నిల్చున్న పాతికేళ్ళ కుర్రాడే వాళ్ల కమాండర్ అని శేషయ్యకూ, రాజేశానికీ అర్థమైంది. వాళ్ళకు కొంచెం దూరంలోనే తోటమాలి గురవయ్య చెట్ల కొమ్మలు గొడ్డలితో నరుకుతూ కనిపించాడు.

వాళ్ళను సమీపించగానే శేషయ్య, రాజేశం, కొమురయ్య వాళ్ళకు నమస్కారం చేశారు. వాళ్ళందరూ రాజేశానికి కొత్తవాళ్లుగానే కనిపించారు. వాళ్ళీవూరుకు రావడం ఇదే మొదటి సారి. చాలా కాలంగా వాళ్ళూరికి మైసయ్య వాళ్ళ దళమే వస్తుండేది. వాళ్ళల్లో రాజేశానికి చాలా మంది తెలుసు. వాళ్లతో స్నేహితులతో మాట్లాడినట్టే మాట్లాడేవారు. కానీ వీళ్ళ మొహాలు చూస్తే వీళ్లతో అలా మాట్లాడటం కుదరక పోవచ్చుననిపించింది.

ఆ దళ కమాండర్ శేషయ్యనూ, రాజేశాన్నీ ఉద్దేశించి మాట్లాడటం మొదలెట్టాడు.

"మేం మీ ఊరికి రావటం ఇదే మొదటిసారి కాబట్టి మేం ఎవరమో మీకు తెలియదు... అందువల్ల మేం ఎవరమో మొదలు మీకు చెప్పాలె. మాది ప్రజావిముక్తి సేన. మేం ఈ పార్టీని కొత్తగా స్థాపించినం. మాదే అసలు సిసలైన విప్లవ పార్టీ. విప్లవ పార్టీల పేరుతో మీ దగ్గరకొచ్చే మిగతా వాళ్ళందరూ దొంగలు. మామూలు దొంగలు కూడా కారు- బందిపోటు దొంగలు. వాళ్ళు విప్లవాన్ని ఎప్పుడో వదిలిపెట్టిండ్రు. వాళ్ళు చందాల పేరుతో తమ జేబులు నింపుకోవడానికే మీ దగ్గరకొస్తున్నరు. వాళ్ళను నమ్మకండి. వాళ్ళను తిప్పికొట్టండి. ముఖ్యంగా

మీ ఊరికెన్నో సార్లొచ్చి మీ దగ్గర్నుంచి వేలకు వేలు దండుకుపోయిండే మైసయ్య. వానికి మాత్రం మీరు వాడు జన్మల మరచిపోలేని గుణపాఠం చెప్పాలె. వాన్ని, వాని దళాన్ని మేం తొందర్లోనే మట్టుబెడ్తం"

అతడో క్షణం సేపాగి మళ్ళీ చెప్పడం మొదలెట్టాడు.

"అసలు విషయానికొస్త... మాది కొత్త పార్టీ అని చెప్పిన గద. మా పార్టీని పటిష్టం చెయ్యడానికి మీ సహాయం కావాలె. మేం మా కాదర్‌కు ట్రయినింగివ్వాలె. ఆయుధాలివ్వాలె. ఈ దేశాన్ని పాలిస్తున్న బూర్జువా వర్గాన్ని చావుదెబ్బ తియ్యాల్నంటె మీ సహకారం కావాలె. త్వొందర్లోనే మీ గ్రామాలన్నీ విముక్తం చెయ్యబడ్తాయి. మనిషి తన తోటి మనిషిని దోచుకునే ఈ దుర్మార్గపు వ్యవస్థ అంతమైపోయి వర్గరహిత సమ సమాజం యేర్పడుతుంది. అందుకు మీ సహాయం కావాలె- అందుకే మిమ్మల్నిద్దర్ని పిలిపించినం. ఈ ఊరికంతటికి మీరే పెద్ద మనుషులనీ, యేం జరిగినా మీ నుంచే జరుగుతుందనీ మాకు తెలుసు. మాకు మీ ఊరి నుండి యాభైవేల డొనేషన్ కావాలె. మీరా డబ్బు మాకీసాయంత్రంలోగా తెచ్చియ్యాలె" అన్నాడు కమాండర్.

"యాభై వేలా?" ఆ మాట రాజేశం నోటి నుండి అప్రయత్నంగా వెలువడింది.

"యేంరా? యాభైవేలా అని గంత ఆశ్చర్యంగడుగుతున్నవు? మొన్న మైసనికెంతిచ్చినవు? కొన్ని గంటలల్ల వానికి యాభై వేలు తయారుజేసియ్యలే. మాకు గంతే యివ్వమంటున్నం. మేం ఎక్కువేం అడుగతలేంగద..."

"మైసయ్యగార్కి మేం యాభై వేలియ్యలేదు. పాతికవేలు ఎంతో కష్టంగిచ్చినం..." అన్నాడు రాజేశం.

"పోనీయ్‌రా... పాతికవేలే.. యింతకు ముందు వానికెన్నోసార్లు గిట్లాటి పాతికవేలిచ్చింగ్రు గద.... మేం మొదటిసారి అడుగుతున్నం. కాబట్టి మాకు యాభైవేలియ్యుంగ్రి".

"లేదు... మాతోటి యాభైవేలు కావు. మమ్మల్ని చంపినాసరె మా దగ్గర యాభైవేలు పుట్టవు" అన్నాడు రాజేశం.

"యేందిరా నువ్వు... ఎక్కువ తక్కువ మాట్లాడుతున్నవ్- ఎవ్వరితోటి మాట్లాడుతున్నవో తెలిసే మాట్లాడుతున్నవా? సర్పంచ్‌వైనాక నువ్వెన్నివేలు సంపాదించినవో మాకు ఎరికే లేదనుకుంటున్నవా?"

"సర్పంచ్‌నైనాక అక్రమమార్గంల నేనొక్క పైస సంపాయించినట్టు రుజువు చేస్తే యే శిక్షకైనా తయార్...." అన్నాడు రాజేశం.

"నా మాట కూడ వినుండ్రు నాయనా! మా దగ్గరేమున్నదో ఒకసారి చూసి అడుగుండ్రి. రెండేళ్ళనించి కాలం పోయింది. వేసిన పంటలన్నీ యెండి పోయినయి" అన్నాడు శేషయ్య.

"నోర్మూయిరా ముసలోడ! గీ మాటలన్నీ మొన్నగా మైసనికెందుకు చెప్పలేదురా? వానికి పాతికవేలెక్కడ్నించి తెచ్చిచ్చింగ్రురా! దొంగలెక్కలు రాసి, దొంగ రకాలు వసూలు చేసి నువ్వెన్ని వేలు సంపాదించినవో మాకెరికేరా! మంచి మాటకు ఊర్లెకుబోయి మాకుడబ్బు తెచ్చిస్తరా... లేదా..."

"లేదా చంపేస్తరు.. గంతేకద... చంపుండ్రి. మా దగ్గరిప్పుడు యాభైరూపాయలు కూడా లేవు.... మీకు యాభై వేలెక్కడ్నించి తెచ్చియ్యమంటరు... " అన్నాడు రాజేశం.

"గా మైసనికైతె తెచ్చిస్తవులే బిడ్డ! మాకియ్య బుద్ధయితలేదు... వాడైతె నువ్వు ఊరిమీదబడి తెచ్చిచ్చిన దాంట్లె నుంచి నీకింతిచ్చేటోడు..."

"యేదున్నుంటె జర తెలుసుకోని మాట్లాడుండ్రి... అడ్డగోలుగ మాట్లాడొద్దు... నేనెటువంటోన్నో ఈ ఊర్లె ఎవరినడిగినా చెప్పుతరు..." అన్నాడు రాజేశం.

"నేను... అడ్డగోలుగ మాట్లాడుతున్ననా? అరేయ్ శేఖర్! వీడు వట్టి పుణ్యానికే రెచ్చిపోతున్నడు. వీన్ని తీసుకపోయిగాచెట్టుకు కట్టెయ్"

వెంటనే శేఖర్ అనే అతడు, మరో ఇద్దరు రాజేశాన్ని లాక్కుపోయి రాజేశం చేతుల్ని వెనక్కి విరిచి తాళ్ళతో కట్టేశారు- తర్వాత అతన్ని అక్కడే వున్న మామిడి చెట్టుకు కట్టేశారు.

"అరె ముసలోడ! నువ్వన్నచెప్పు. మాకు డబ్బు తెచ్చిస్తవా? లేదా? వెంటనే ఒప్పుకోకపోతే నీకూ వానికి పట్టిన గతే పడ్తుంది".

"యెట్లొప్పుకొమ్మంటరండి! ఒప్పుకుంటే ఒప్పుకున్న ప్రకారం మీకు డబ్బు తెచ్చియ్యాలెగద. నేను నమ్మిన నా యిష్టదైవం వెంకటేశ్వరస్వామి మీద ప్రమాణం చేసి చెప్తున్న, ఊర్లె ఎవరి దగ్గర కూడ డబ్బు లేదు. మేం మీ దగ్గర కొచ్చేటప్పుడు అందరితోటి మాట్లాడే వచ్చినం. తిండి కోసం దాచుకున్న ధాన్యం అమ్మి ఓ ఐదువేలు ఇవ్వగల్గుతం... అంతకు మించి ప్రస్తుతం మాతోటిగాదు" అన్నాడు శేషయ్య.

"ఐదువేలా? మేం నీ కండ్లను బిచ్చపోల్లలెక్క కనబడ్తున్నామురా! వీన్ని కూడా తాళ్ళతోటి కట్టెయ్యుండ్రి"

"శేషయ్యను కూడా రాజేశం పక్కకు తీసుకొచ్చి అదే చెట్టుకు కట్టేశారు.

"దిమాగ్‌తోటి జర ఆలోచించి చెప్పుండ్రి. ఊర్లె కుబోయి వాళ్ళకిచ్చినట్టె మాక్కూడ పాతికవేలు తెచ్చిస్తమంటె కట్లిప్పి ఊర్లెకు బంపుతం... లేకపోతె ఇద్దర్నీ కాల్చేసిపోతం."

కాసేపు ఎవరూ మాట్లాడలేదు.

వాళ్లంతా వాళ్ళ పక్కనే వున్న కిట్‌బ్యాగుల్ని తెరిచి లోపలున్న టిఫిన్ బాక్సెస్‌ను బయటకు తీసి భోజనాలు చెయ్యడం మొదలెట్టారు.

ఆలోచిస్తున్న కొద్దీ రాజేశం శరీరంలోని రక్తం మసలిపోయింది. తనిదివరకు అన్నల్ని చాలాసార్లు కలిశాడు. తన పట్ల ఎవ్వరూ ఇంత ఘోరంగా, యింత క్రూరంగా ప్రవర్తించలేదు. వీళ్ళు నిజమైన అన్నలు కారు. వీళ్ళు నకిలీలు... నిజమైన అన్నలైతే ఇట్లా ప్రవర్తించేవాళ్ళు కారు... వీళ్లీ రోజు శేషయ్యగార్ని, తననూ కాల్చేసి వెళ్ళిపోతారు. అందుకు సందేహం లేదు. డబ్బు తెస్తామంటేనే వదుల్తారు. కాని అంత డబ్బెక్కడ్నించి తెస్తారు. ఊర్లో ఎవర్ని డబ్బడిగినా తమను అసహ్యించుకుంటారు. చావనైనా చస్తాంగాని మా దగ్గర డబ్బు లేదంటారు... ఈపాటికి ఊర్లో వాళ్ళంతా తోట దగ్గరకు వచ్చే వుంటారు... తామిక్కడకొచ్చి అప్పుడే ఐదారు గంటలైపోయింది. ఇంకా రావడం లేదేమిటని వాళ్ళకు అనుమానం వచ్చే వుంటుంది.

తామేం తప్పు చేశామని తమను వాళ్ళిలా దొంగల్లో, హంతకుల్లో బంధించినట్టు తాళ్ళతో కట్టి బంధించారు. డెభైయేండ్ల వృద్ధుడని కూడ చూడకుండా శేషయ్యగార్ని కూడా బంధించారు. ఎంత అన్యాయం? శేషయ్యగారు కూడా ఇదివరకెన్నో సార్లు అన్నల్ని కలిశాడు- వాళ్ళు ఆయన్నెంతో గౌరవించేవాళ్ళు. చాలా కాలం ఆయన పట్వారీగా పనిచేసినప్పటికీ ఆయన ప్రజలపట్ల ఎంతో న్యాయంగా, ఉదారంగా ప్రవర్తించేవాడని ఊర్లో అందరూ చెప్పుకుంటారు. ఆయన కూడా తనలాగే ఓ వెనుకబడిన కులానికి చెందినవాడే. కొంతకాలం ఆయన అసలు పట్వారీకి గుమాస్తాగా పనిచేశాడట. తర్వాత ఆయనే అసలు పట్వారి అయ్యాడు. తనుగానీ, శేషయ్యగారు కానీ ఎవరికీ అన్యాయం చెయ్యలేదు. తను చాలా వెనుకబడిన గౌడ కుటుంబంలో పుట్టాడు. స్వయంకృషితో ఇంటర్ దాకా చదివాడు. అటల్లో తనకున్న ప్రావీణ్యాన్ని చూసి

తనను టీచర్స్ చాలా ప్రోత్సహించేవాళ్ళు. చిన్నప్పట్నించీ తనూర్లో ఊరి అభివృద్ధి కోసం యే కార్యక్రమం జరిగినా ఎంతో ఉత్సాహంగా పాల్గొనేవాడు. ఎక్కడ అన్యాయం జరిగినా వెంటనే స్పందించేవాడు. ఎదిరించేవాడు. తనలోని ఈ సేవాభావాన్ని గుర్తించే శేషయ్యగారు తనను ఎన్నికల్లో పాల్గొనమని ప్రోత్సహించాడు. ఇదివరకటి సర్పంచ్‌ను ఓడించటానికి తనే సరి అయిన అభ్యర్థినని ఆ ఊరి యువకులందరికీ చెప్పాడు. అలా ఊర్లో అందరి మన్ననలతోటే తను సర్పంచ్ పదవికి పోటీ చేసి గెల్చాడు. అదే ఇప్పుడు వీళ్ళ దృష్టిలో పెద్ద నేరమైపోయింది.

ప్రజా ప్రతినిధులంటే వీళ్ళకు విపరీతమైన ద్వేషం ఉంది. అందరు ప్రజా ప్రతినిధులు ఒక లాంటి వాళ్ళే అనుకుంటారు. తను సర్పంచ్ అయినప్పట్నించి ఇప్పటివరకు ఎంతో నీతిగా ప్రవర్తించాడు. ప్రజల డబ్బుకు తనెప్పుడూ ఆశపడలేదు. ఎవ్వరికి కూడా తనను వేలెత్తి చూపించడానికి అవకాశం కల్పించలేదు. ఇంతకాలం అన్నలు కూడా తననెంతో గౌరవించారు- ఈ అన్నలెవరో దొంగలు. వీళ్ళు అసలు అన్నలు కారు.

వాళ్ళంతా భోజనాలు చెయ్యడం ముగించి కిట్ బ్యాగులు సర్దుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు.

అకస్మాత్తుగా సెంట్రీ విజిల్ వేసి అందర్నీ అలర్ట్ చేశాడు. వాళ్ళందరూ రెప్పపాటులో లేచి గన్స్ పట్టుకొని పొజిషన్స్ తీసుకున్నారు. యేమైంది? పోలీసులొచ్చారా?

సెంట్రీ డ్యూటీలో వున్నతడు "ఊరివాళ్ళు చాలా మందొచ్చింద్రు. వాళ్ళను యేమీ చెయ్యొద్దంటున్నరు....' అన్నాడు.

"వాళ్ళనెవర్నీ లోపలకు రానీయొద్దు.... వెళ్ళిపొమ్మని చెప్పు. మర్యాదగా వినకపోతే హాండ్ గ్రెనేడ్లు విసరండి. కమాన్... క్విక్..."

కొన్ని క్షణాల్లోనే హాండ్‌గ్రెనేడ్లు పేలిన శబ్దాలు....

రాజేశం తన శక్తినంతా కూడదీసుకొని తన కట్లను విడిపించుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

వాళ్ళంతా అక్కడ్నించి వెళ్ళిపోవడానికి సిద్ధమౌతున్న సూచనలు కనిపించాయి. పోతూ పోతూ వీళ్ళు తమనేం చేసిపోతారో? తమ వెంట తీసుకుపోతారా? కాల్చేసిపోతారా?

"వాళ్ళిద్దర్నీ మనతో తీసికెళ్దాం. అరేయ్ కొమురయ్యా! వీళ్ళిద్దర్ని మాతో తీసుకుపోతున్నం. రేపటివరకైనా డబ్బు తెచ్చిస్తే వాళ్ళను వదిలిపెడ్తమని మీ ఊరివాళ్ళతో చెప్పు... డబ్బు తెచ్చి మాకెక్కడ ఇవ్వాల్నో రేపు తెల్లవారకట్ల పోచయ్యొచ్చి చెప్పుతడు- నువ్వెళ్ళిపో" అన్నాడు కమాండర్.

కొమురయ్య చేతులు జోడించి "వాళ్ళనేం చెయ్యొద్దయ్యా! వాళ్ళు చాన మంచోల్లయ్యా. మేం ఎట్లనన్న జేసి పైసలు పట్టుకొస్తంగని వాళ్లనేం చెయ్యకండయ్యా" అన్నాడు కొమురయ్య బిగ్గరగా యేడుస్తూ.

"యేం చెయ్యం. నువ్వు మేం చెప్పినట్టు చెయ్. పో.... క్విక్!" అంటూ కమాండర్ కొమురయ్య వైపు తుపాకి గురిపెట్టాడు.

కొమురయ్య వెంటనే అక్కడ్నించి పరిగెత్తుతున్నట్టుగా వెళ్ళిపోయాడు.

రాజేశాన్ని ఆవేశం పూర్తిగా వశపరచుకుంది. అతని రక్తం సలసల మరిగి మసలిపోసాగింది. వీళ్ళు తమను పక్కనే వున్న అడవిలోకి తీసుకెళ్ళి చంపేస్తారు. తను చచ్చేలోగా వీళ్ళల్లో ఒక్కన్నో ఇద్దర్నో తను చంపాలి... అక్కడే అతనికి కొంచెం దూరంలో పడి వున్న చెట్లను నరికే గండ్ర గొడ్డలి కనిపించింది. ఆ గొడ్డలి తోటమాలి గురవయ్యది.... అది తన చేతుల్లోకొస్తె చాలు... తననెవరూ యేమీ చెయ్యలేరు.

"వాళ్ళ కట్లు విప్పండి. కమాన్! క్విక్.... మనం పోదాం" అన్నాడు కమాండర్.

వాళ్ళొచ్చి రాజేశం కట్లు విప్పుతున్నారు. రెప్పపాటులో రాజేశం వాళ్ళిద్దర్నీ తప్పించుకొని అక్కడ పడివున్న గొడ్డలిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"రాజేశం... ఆగు!" అంటున్న శేషయ్య మాటలు అతనికి వినిపించలేదు.

గొడ్డలితో అతడు వీరవిహారం చేశాడు.

వాళ్ళల్లోని ఇద్దరి తలల్ని నరికేశాడు. మూడో వ్యక్తి వైపు వెళ్ళబోతుండగా కమాండర్ చేతిలోని ఎ.కె.ఫార్టీసెవెన్ పేలింది. రాజేశం నేలకొరిగాడు. అయినా అతని మీద గుండ్ల వర్షం కురుస్తూనే ఉంది. ఓ గుండు శేషయ్య కడుపులోకి దూసుకుపోయింది. "హరీ!" అంటూ శేషయ్య నేల కొరిగాడు. లిప్తపాటులో అక్కడ నాలుగు శవాలు!

వాళ్ళల్లో శవాలుగా మారకుండా ఉన్నవాళ్ళందరూ వెంటనే ఆ ప్రదేశాన్ని ఖాళీచేసి అక్కడ్నించి వెళ్ళిపోయారు.

(ఆంధ్రభూమి ఆదివారం, 25 జులై 1999)